క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

సిరిసిల్ల కల్చరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రదీప్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ ఉద్యోగాల భర్తీకి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రిక్రూట్‌మెంట్ హెడ్ వినయ్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీ ఎఫ్‌సీ, ఏక్సిస్ బ్యాంక్ శాఖల్లో పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీని ఈమేళా ద్వారా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. వాసవీనగర్‌లోని మహతి మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగే మేళాకు డిగ్రీ ఉత్తీర్ణులై 30 ఏళ్లలోపు వయస్సున్న మహిళలు హాజరుకావాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షల అనంతరం ఎంపికైన మహిళలకు శిక్షణ ఇచ్చి నియామకాలు చేపడుతామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.2.25 నుంచి 2.8లక్షల ప్యాకేజీ లభిస్తుందన్నారు. అర్హత, ఆసక్తిగల నిరుద్యోగ మహిళలు ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్‌కార్డుతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 8106764653 లేదా 98855 35991 సెల్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బండి వ్యాఖ్యలు హాస్యాస్పదం

సిరిసిల్లటౌన్: కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బండి సంజయ్ కుమార్‌ను గెలిపిస్తే కేంద్ర కరీంనగర్‌కు రూ. 2లక్షలు కూడా తేలేదని బీఆర్‌ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఫలితాలలో కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకత, బీఆర్‌ఎస్ పోటీ చేయకపోవడం వల్లే బీజేపీ గెలిచిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ యూత్ నాయకులు ఎండి మునీర్, అంజాత్, షాదాబ్, మన్సూర్, వడ్లూరి సాయి, అస్లం, తదితరులు పాల్గొన్నారు.

డీఎంకు సన్మానం

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవర్ ఫుల్ ప్రోగ్రాం చివరి రోజు శుక్రవారం సిరిసిల్ల డిపోలో నిర్వహించారు. డిపో మేనేజర్ ప్రకాశ్‌రావును ఆర్టీసీ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ ప్రోగ్రాంలో ట్రాఫిక్ సూపర్ వైజర్లు వర్జిలాల్, రామకృష్ణ, రామ్ రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణహరి, కానిస్టేబుల్ రాజేందర్ రెడ్డి, వినయ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: క్షయవ్యాధి నివారణకు అందరూ కృషిచేయాలని మండల వైద్యాధికారిణి సారియా అంజుమ్ అన్నారు. మండలప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రాచర్ల గొల్లపల్లి సబ్ సెంటర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రెండు వారాలు దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, రాత్రిపూట చెమటలు పట్టడం లాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. 23 మందిని పరీక్షలకు పంపినట్లు వైద్యాధికారిణి తెలిపారు. శిబిరంలో టీబీ సూపర్‌వైజర్ మహిపాల్, టీబీ నోడల్ అధికారి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

సిరిసిల్లటౌన్: ఢిల్లీ క్యాంప్ కార్యాలయంలో అంబేడ్కర్, భగత్‌సింగ్‌లకు జరిగిన అవమానం శోచనీయమని అఖిలపక్షం నేతలు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భగత్‌సింగ్, అంబేడ్కర్ చిత్రపటాలను తొలగించడాన్ని నిరసిస్తూ శనివారం సిరిసిల్లలో మహిళలతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అఖిలపక్షం పార్టీలనేతలు ప్రకటించారు. అంబేడ్కర్, భగత్ సింగ్ చిత్రపటాలను తొలగించి నరేంద్ర మోదీ అమిత్ షా చిత్రపటాలను పెట్టడం ఏంటని ప్రశ్నించారు. మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా నాయకులు సోమ నాగరాజు, సంజీవనగర్ సంఘం అధ్యక్షుడు కొంపెల్లి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై స్పందించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని మానేరువాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు గురవుతోందని, ఇసుక తరలింపుపై కలెక్టర్, ఎస్పీలు స్పందించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేఖరులతో మాట్లాడారు. మండలంలోని పదిర, వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూరు, రామలక్ష్మణులపల్లె గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 17 రోజులుగా ఇసుక రవాణా జరుగుతుందన్నారు. ఓ వైపు భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపోతుండగా, ఇసుకను తరలింపు ఆగడం లేదన్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇసుక రవాణాను అరికట్టేందుక మైనింగ్ అధికారులు, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

రెండు రోడ్డు ప్రమాదాలు

- ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మొదటి బైపాస్‌రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. మండలంలోని అక్కపల్లికి చెందిన కొప్పుల వెంకన్న బైక్‌పై వెళ్తుండగా బండలింగంపల్లికి చెందిన ఎల్లారెడ్డి బస్సు కోసం రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. గాయపడ్డ ఇద్దరిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అ లాగే అంతకుముందు ఓ ద్విచక్ర వాహనదారుడు ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో గాయపడ్డాడు.



కేంద్ర సమాచార, ప్రసారభారతి అధికారులను సత్కరిస్తున్న అర్చకులు



రాజన్న ఆలయంలో భక్తులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15వేల మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణవ్రతాలు, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకుని ప్రసాదాలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. రాజన్నను కేంద్ర సమాచారశాఖ, ప్రసారభారతి అధికారులు దర్శించుకున్నారు. ప్రసారభారతి తెలంగాణ క్లస్టర్ హెడ్ హరిసింగ్, దక్షిణాది రాష్ట్రాల జోనల్ హెడ్ గీతారాణిలకు ఆలయ అర్చకులు ప్రసాదాలు అందించి, సత్కరించారు. టెక్నీషియన్ శ్రీనివాస్, టీసీ లక్ష్మీనారాయణ ఉన్నారు.

ముందస్తు మహిళా దినోత్సవం



సిరిసిల్ల : వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో మహిళా దినోత్సవం



వేములవాడ అర్బన్: మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, మహిళా ఉపాధ్యాయురాళ్లకు సన్మానం



వీర్నపల్లి : బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

సిరిసిల్ల: కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులను జిల్లా అధికారుల సంఘం(డోర్స్) ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా అధికారులను సత్కరించారు. ఎస్డీసీ, సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత, మిషన్ భగీరథ ఈఈ జానకి, డీఎస్‌వో వసంతలక్ష్మి, జిల్లా వైద్యాధికారి రజిత, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రజిత, జిల్లా మహిళా అధికారులు విజయలక్ష్మి, రోజాను సన్మానించారు. 'డోర్స్' ప్రతినిధులు సీపీవో శ్రీనివాసాచారి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో...

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో జిల్లా వైద్యాధికారి రజిత కేక్ కట్ చేశారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నయీమా జహాన్ షేక్, డాక్టర్ సాహితీ, మహిళా వైద్యులు పాల్గొన్నారు.

వేములవాడ అర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వేములవాడ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూటీఎస్ జిల్లా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాట్ల మల్లేశం పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి ఉన్నత పాఠశాలలో టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయురాళ్లను ఘనంగా సన్మానించారు. టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్, ప్రధానోపాధ్యాయుడుప్రవీణ్‌కుమార్, టీఆర్‌టీఎఫ్ బాధ్యులు విక్కుర్తి హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. రాచర్లగుండారం మండల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిని సన్మానించారు. ఎంపీడీవో సత్తయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను, సిబ్బందిని ఎంపీడీవో రాజేందర్ సన్మానించారు. దమ్మన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

ముస్తాబాద్: మండల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను తహసీల్దార్ సురేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. నాయబ్ తహసీల్దార్ భూపేశ్, ఆర్ఐ రఘు, సుమలత, నరేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో పీఎంశ్రీ ఎంపీపీఎస్ పాఠశాలలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఉదయలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం మహిళలకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

- రెవెన్యూ అధికారులతో వాగ్వాదం
- లోడ్ చేసిన ఇసుకను ఖాళీ చేయించిన వైనం
- వెంకటాపూర్ ఇసుక రీచ్ వద్ద ఉద్రిక్తత



రెవెన్యూ అధికారులతో రైతుల వాగ్వాదం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని ఇసుక ట్రాక్టర్లను రైతులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగడంతోపాటు ట్రాక్టర్లలో నింపిన ఇసుకను ఖాళీ చేయించారు. మండలంలోని వెంకటాపూర్ ఇసుక రీచ్ నుంచి శుక్రవారం అనుమతితో నారాయణపూర్‌కు చెందిన ట్రాక్టర్లు ఇసుకను ఇసుకను తరలిస్తున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఆ ప్రాంత రైతులు ఇసుకట్రాక్టర్లను అడ్డుకున్నారు. తమ గ్రామ సమీపంలోని వాగునుంచి ఇసుకను తరలించవద్దని కోరారు. అప్పటికే ట్రాక్టర్లలో లోడ్ చేసిన ఇసుకను ఖాళీ చేయించారు. సమాచారం అందుకున్న ఆర్ఐ శ్రావణ్ సిబ్బందితో అక్కడికి వచ్చి అనుమతులున్నాయని, అడ్డుకోవద్దని చెప్పినప్పటికీ రైతులు ఒప్పుకోలేదు. ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని రెవెన్యూశాఖ ఆర్ఐ శ్రావణ్ హెచ్చరించారు. జిల్లాలో రెగ్యులర్‌గా నడిచే ఇసుక రీచ్‌లను ఎత్తివేయడంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని చర్చ సాగింది.

● బీఆర్‌ఎస్ నాయకుల వ్యాఖ్యలు విడ్డూరం

తంగళ్లపల్లి: బీఆర్‌ఎస్ నాయకుల వ్యాఖ్యలు విడ్డూరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టోని అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి గురించి కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌కు అర్హత లేదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత సిరిసిల్ల మానేరు వాగునుంచి రూ. వందలాది కోట్ల విలువచేసే ఇసుకను అక్రమంగా అమ్ముకున్నారని మండిపడ్డరు. సమావేశంలో చుక్క రాజశేఖర్, నేరెళ్ల నర్సింగం, మునిగెల రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● ఐదో రోజుకు చేరిన రిలే దీక్షలు

ఇల్లంతకుంట: రంగనాయక సాగర్ ప్రాజెక్టు ఎల్ఎం 6 కాలువ పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద లింగాపూర్‌లో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. కాంగ్రెస్ మండల నాయకులు వెంకటరమణారెడ్డి, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, కేతిరెడ్డి వెంకటరెడ్డి, నవీన్‌రెడ్డి, దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఐదు రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ రైతులు గాదె మధుసూదన్, పాల్గొన్నారు.

● ద్విచక్రవాహనం చోరీ

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి గ్రామానికి చెందిన మోతె లింగారెడ్డికి చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. శుక్రవారం గ్రామపంచాయతీ వద్ద నిలిపిన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు ధర్మారం, కోనరావుపేట, శివంగాలపల్లి గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాల కోసం వెతకగా కోనరావుపేట, శివంగాలపల్లిలో సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. లింగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

● గౌవ్ బచావ్ దేశ్ బచావో

వేములవాడ: రాజన్న ఆలయ గోశాలలో వేసవి దృష్ట్యా కోడెలు, ఆవులకు చలువ పందిళ్లు, పచ్చిగడ్డి, తాగునీరు పూర్తిస్థాయిలో ఉంచడంతోపాటు పశు వైద్యుడిని అందుబాటులో ఉంచాలని ఈవో వినోద్ రెడ్డిని కోరారు. నాయకులు ఈసంపల్లి వెంకన్న, వూట్కూరి రాధాకృష్ణారెడ్డి, గడప కిషోర్‌రావు, గొరిశెట్టి శ్రీనివాస్, శ్రీపతిరాజ్‌లు శుక్రవారం తెలిపారు.

● సమస్యలు పరిష్కరించండి

ఎల్లారెడిపేట: మండలకేంద్రానికి చెందిన యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుచ్చిలింగ్ సంతోష్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి శ్రీధర్ బాబును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సంతోష్‌గౌడ్ తెలిపారు. కలిసిన వారిలో రాములు, బుచ్చాగౌడ్ తదితరులున్నారు.


నిధులు మంజూరుచేయాలి



ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి మీదుగా వంతడుపుల, వల్లంపట్లకు బీటీరోడ్డు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు శుక్రవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. బీటీరోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇక్కడ సామ బాల్‌రెడ్డి, కాట్నపల్లి రవీందర్‌రెడ్డి, చిమ్మన గొట్టు శ్రీనివాస్, కట్ట నరసింహారెడ్డి, మధురెడ్డి, కనకయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సింగసముద్రం తూముకు గండి

- పెద్దవాగులోకి చేరుతున్న నీరు
- ఆందోళనలో రైతులు



గండికొట్టడంతో సింగసముద్రం నుంచి వృథాగా పోతున్న నీరు

ఎల్లారెడ్డిపేట : మండలంలోని రాచర్లబొప్పాపూర్ శివారులోని సింగసముద్రం తూముకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి గండికొట్టారు. తూముకు పడ్డ గండితో సముద్రంలోని నీరు పారేటివాగు, అక్కడి నుంచి పెద్దవాగులోకి వృథాగా పోతున్నాయి. దీంతో సింగసముద్రం ఆయకట్టు రైతులు నీటివృథాతో ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ సీజన్‌లో తైబందు విధించి ఆయకట్టు రైతులు వరిపంట సాగుచేశారు. పంటలకు చివరి వరకు సాగునీరు అందుతుందా అనే విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే సముద్రం తూముకు గుర్తుతెలియని వ్యక్తులు గండి కొట్టడంతో చెరువులో ఉన్న నీరు ఖాళీ అవుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు సముద్రంకు పడ్డ గండిని మరమ్మతు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



మోహినికుంటలో పోచమ్మబోనాలు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం మోహినికుంటలో శుక్రవారం పోచమ్మ బోనాలు తీశారు. నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా బోనాలతో మొక్కులు చెల్లించారు.

ఆర్‌ఎంపీ వైద్యునిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు పత్తిపాక రాజలింగంపై శుక్రవారం పిచ్చికుక్కలు దాడిచేశాయి. ఈ దాడిలో గాయపడ్డ రాజలింగంను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి, వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. గత వారం రోజులుగా పిచ్చికుక్కల దాడిలో పది మందికి పైగా పిచ్చి కుక్కలు కరిచి గాయపర్చాయని, పిచ్చికుక్కలను బెడదను గ్రామ పంచాయతీ సిబ్బంది విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

బాలుడిని కరిచిన పిచ్చికుక్క

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని బుడగజంగాలకాలనీకి చెందిన పర్వతం జీవన్‌పై శుక్రవారం పిచ్చికుక్క దాడి చేసింది. రోదిస్తున్న జీవన్‌ను స్థానికులు గమనించి కుక్కను వెల్లగొట్టారు. అప్పటికే జీవన్ తల, చెవులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ర్యాగింగ్ చేస్తే చర్యలు

తంగళ్లపల్లి: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై రామ్మోహన్ అన్నారు. మండలంలోని జిల్లెల్లలోని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర విశ్వవిద్యాయంలో జరిగిన ర్యాగింగ్ వ్యతిరేక కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ట్రైనీ ఎస్సై లక్ష్మణ్, కళాశాల అసోసియేట్ డీన్ శ్రీదేవి, విద్యార్థి విభాగ అధికారి రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల వ్యాఖ్యలు అర్థరహితం



మాట్లాడుతున్న శిరస్వాల్ కైలాష్

సిరిసిల్లటౌన్: అబద్ధాలతోనే బీఆర్‌ఎస్ నేతలు రాజకీయ పబ్బం గడుపుతున్నారని, కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై వారి వ్యాఖ్యలు అర్థరహితమని బీజేపీ ప్రధాన కార్యదర్శి శిరస్వాల్ కైలాష్ వ్యాఖ్యానించారు. శుక్రవారం సిరిసిల్ల నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి కేంద్ర మంత్రి బండి సంజయ్ రూ. 12వేల కోట్లకు పైగా తీసుకొచ్చినా బీఆర్‌ఎస్ నేతలు అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. నాయకులు ఎనగంటి నరేశ్, మొగిలి రాజు, వంగ అనీల్‌కుమార్, పంపరి అర్జున్, కోడం శ్రీనివాస్, రమేశ్‌చారి, చందు, సురేశ్, వెంకటేశ్ తదితరులున్నారు.

ఉద్యమకారుల హక్కుల సాధనకు పోరాటం



మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

సిరిసిల్లటౌన్: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుల హక్కుల సాధనకు పోరాటం చేస్తున్నట్లు జిల్లా తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వక్తలు మాట్లాడారు. ఈనెల 10న హైదరాబాద్‌లో మినీ మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారులను గుర్తించకపోవడం శోచనీయన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం వద్ద మినీ మిలియన్ మార్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జేఏసీ నాయకులు బుస్సా వేణు, కుసుమ విష్ణు, చెన్నమనేని పురుషోత్తం రావు, దండు మల్లికార్జున్, సామల రాములు, తిమ్మాపురం అశోక్, కొమ్మరాజుల ఐలయ్య, ఏరెడ్డి వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, సత్యనారాయణ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలి



తంగళ్లపల్లి: ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ముస్తాబాద్: పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేసి వేతనాలు పెంచాలని కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో పంచాయతీ కార్మికులు తెలంగాణ తల్లి విగ్రహం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అర్హులైన కార్మికులను రెగ్యులర్ చేసి, వేతనాలు పెంచి, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని ఎంపీడీవో బీరయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల సంఘం నాయకులు లక్ష్మణ్, పి.బాబు, రమేశ్, రవీందర్, రాజయ్య, రాజు, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మండల గ్రామపంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎంపీడీవో ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, చందుర్తి గ్రామపంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు మామిడి నరేశ్, ఉపాధ్యక్షుడు వాసం కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ఎంపీడీవో లక్ష్మీనారాయణకు గ్రామ పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందించారు. మండల గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ మాట్లాడారు. కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి ఇందిరమ్మ ఇళ్లు, మంజూరు చేయాలన్నారు. కార్మికులు తదితరులున్నారు.

గంభీరావుపేట: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రానికి చెందిన పారిశుధ కార్మికులు శుక్రవారం ఎంపీడీవో రాజేందర్‌కు వినతిపత్రం అందించారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు.

వీర్నపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్ దాస్ గణేశ్ డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ వాజిద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్, గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు న్యాత నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు

నూలు వ్యాపార సంఘం అధ్యక్షుడిగా వెంకటస్వామి

- ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్ల: సిరిసిల్ల నూలు వ్యాపార సంఘం అధ్యక్షుడిగా బొట్ల వెంకటస్వామి రెండోసారి విజయం సాధించారు. సిరిసిల్ల నూలు వ్యాపార సంఘంలో గురువారం రాత్రి జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష స్థానం కోసం నల్ల ప్రదీప్, బొట్ల వెంకటస్వామి పోటీపడ్డారు. ఎన్నికలు నిర్వహించగా ప్రదీప్‌పై వెంకటస్వామి ఏడు ఓట్లతో విజయం సాధించారు. సంఘం ఉపాధ్యక్షుడిగా దొంత దేవదాస్, ప్రధాన కార్యదర్శిగా మ్యాన సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా వేముల వెంకటనర్సయ్య, కోశాధికారిగా యెల్లె లక్ష్మీరాజం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని మాజీ అర్బన్ బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణ, నూలు వ్యాపార సంఘం మాజీ అధ్యక్షుడు పిస్క మధు, వస్త్రోత్పత్తిదారులు అభినందించారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం త్వరలో నిర్వహించనున్నారు.

పవర్‌లూమ్ మహిళా కార్మికురాలికి సన్మానం

సిరిసిల్ల: సిరిసిల్లలో నేత కార్మికులు మాత్రమే నడిపే సాంచాలను మగవారితో సమానంగా నడుపుతున్న మహిళా కార్మికురాలిని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ హైదరాబాద్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌కు చెందిన బిల్ల లత ఇంట్లో మరమగ్గాలు నడుపుతూ వస్త్రోత్పత్తి చేస్తుంది. భర్త చేసే పనిలో భాగస్వామిగా మారి సాంచాలు నడుపుతున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజారామయ్యర్ ఆమెను హైదరాబాద్‌లో సత్కరించారు.

వారసంతలో తప్పిపోయిన బాలిక



తప్పిపోయిన చిన్నారి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వారసంతలో ఓ బాలిక తప్పిపోయింది. అక్కడున్న వారు చిన్నారిని దగ్గరకు తీసుకొని వివరాలు అడగడంతో అమ్మ.. నాన్న అంటూ రోదించింది. బాలిక తన పూర్తి వివరాలను చెప్పలేకపోతోంది. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా బాలిక తప్పిపోవడంపై విస్తృత ప్రచారం జరిగింది. తప్పిపోయిన చిన్నారిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. చిన్నారి తల్లిదండ్రుల గురించి వివరాలు పోలీసులు సేకరిస్తున్నారు.

బీసీ సాధికారతే లక్ష్యం

సిరిసిల్లటౌన్: బీసీ సాధికారితతోనే వెనుకబడిన వర్గాలు అభ్యున్నతి సాధిస్తాయని సీ సాధికారత సంఘం అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలో పట్టణ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. మార్చి 10న సిరిసిల్ల పట్టణ,, యువత, మహిళా కమిటీల ప్రమాణ స్వీకారం, జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొండ దేవయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పలాస నరేందర్, ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. బీసీ నాయకులు గుజ్జె శివరాం, చింతకుంట వెంకటేశం, అన్నారపు వేణుగోపాల్, జక్కని రవి, సజ్జనం శ్యామ్ సుందర్, బొజ్జ శ్రీనివాస్, దాసి సతీశ్, అశోక్, బేతి రవీందర్, రాపల్లి రాజు, సతీష్, కూస శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు

వేములవాడ అర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ శివారు రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని ఇండికా కారు ఢీకొనడంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్సై సముద్రాల రాజు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.